

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా, తదితరులు

మోదీ నాయకత్వంపై ప్రజల సంతృప్తి

- కిషన్‌రెడ్డి అత్యధిక మెజార్టీ సాధిస్తారు
- టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు మోదీ నాయకత్వంపై సంతృప్తిగా ఉన్నారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా అన్నారు. సికింద్రాబాద్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అత్యధిక మెజారిటీ సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి విజయం వెనుక టీడీపీ కార్యకర్తల కృషి, పూర్తి సమన్వయం ఉందని, తెలుగు తమ్ముళ్లు క్రియాశీలకంగా పనిచేశారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో జరిగిన పోలింగ్ శాతాన్ని, అక్కడి సరళిని బట్టి పరిశీలిస్తే అన్ని వర్గాల ప్రజలు టీడీపీ పట్ల పూర్తి విశ్వాసంతో ఓటు వేసినట్లు కనిపిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో ముందుంటుదన్న నమ్మకంతో టీడీపీకే ప్రజలు ముక్తకంఠంతో ఓటు వేశారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్. ప్రకాష్, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాలే గెలిపిస్తాయి: బీజేపీ

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ గెలుపు ఖాయమని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు వీఎస్టీ రాజు, పార్టీ రాష్ట్ర నాయకుడు గాదె శ్రీనివాస్, మైనారిటీ మోర్చా (వక్ఫ్‌బోర్డ్) రాష్ట్ర కార్యదర్శి ఎండీ మహమూద్ ధీమా వ్యక్తం చేశారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే విజయం తమ అభ్యర్థి కిషన్‌రెడ్డినే వరిస్తుందని తెలిపారు. మోదీ బహిరంగ సభతో ప్రజలంతా బీజేపీవైపు మొగ్గుచూపారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ అభ్యర్థి గెలుపునకు సహకరిస్తాయని, భారీ మెజార్టీతో కిషన్‌రెడ్డి గెలుస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు.

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సూర్యనారాయణశర్మ, శేషషాయి, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం బాబు, కౌండిన్యప్రసాద్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు నరేష్‌లు ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం అడిక్‌మెట్‌లోవారు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఓటింగ్ సరళిని బట్టి బీజేపీకి పోలైన ఓట్లలో 50 శాతం వస్తాయన్నారు.

పూడికతీత పనులు ముమ్మరం చేయాలి

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ నాలా పరిసరప్రాంతాల్లో పూడికతీత పనులు ముమ్మరం చేయాలని గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన బస్తీవాసులతో కలిసి మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా నాలా పరీవాహక ప్రాంతాల్లో ప్రజలు వరదనీటితో సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉన్న లోతుకంటే మరింత లోతుగా పూడికతీత పనులు జరిపించాలని ఆయన కోరారు.

పూజ చేస్తుండగా మంటలంటుకొని వృద్ధురాలి మృతి

చాదర్‌ఘాట్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలంటుకుని వృద్ధురాలు మృతి చెందింది. మలక్‌పేట ఎస్‌ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట శ్రీపురం కాలనీలో నివసిస్తున్న వైవీకే రాజేశ్వరి(72) మంగళవారం ఉదయం పూజ చేస్తుండగా మంటలంటుకున్నాయి. పొరుగింటి వారు గమనించి బయటకు వెళ్లిన ఆమె భర్త భాస్కర రామారావుకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే ఇంటికి చేరుకోగా.. అప్పటికే రాజేశ్వరి కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో ఉంది. ఆస్పత్రికి తరలించడానికి 108 అంబులెన్స్‌ను రప్పించారు. అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మలక్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు..

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాటసింగారం శివారు చాచా దాబా సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి సోమవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి శరీరంపై నీలం రంగు చొక్కా, డార్క్ బ్లూకలర్ ప్యాంటు ఉన్నాయని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662650, 8712662293 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

పసుమాముల కళానగర్‌కు చెందిన రెవెళ్ల జంగయ్య(40) ఆటో డ్రైవర్. మంగళవారం పనిమీద అబ్దుల్లాపూర్‌మెట్ వెళ్లాడు. విజయవాడ జాతీయ రహదారిపై మయూరి కాంట వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైప వేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందాడు. మృతుడి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

ఎంబీటీ అధికార ప్రతినిధికి తీవ్రగాయాలు

చాదర్‌ఘాట్, మే 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎంబీటీ అధికార ప్రతినిధి తీవ్రంగా గాయపడ్డాడు. మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బంధువు మృతిచెందడంతో ఎంబీటీ అధికార ప్రతినిధి మంగళవారం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా చంచల్‌గూడ జైలు వద్ద నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జి వద్ద ఇనుపరాడ్ తగలడంతో అదుపు తప్పి కిందపడిపోవడంతో తలకు, కుడి చేతికి తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే మలక్‌పేట యశోద ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడి ఆత్మహత్య

కవాడిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బండమైసమ్మనగర్‌లో నివసిస్తున్న అబ్దుల్ రజాక్‌కు ఇద్దరు కకుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు అబ్దుల్ షోహెబ్(20) రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతడు మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులకు షోహెబ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో వెంటనే గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకొని కిందకు దించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి రజాక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు వేయడానికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యం

కవాడిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయడానికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైంది. గాంధీనగర్ ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం డిజేబుల్ హోంలో ఉంటున్న పదిమంది గుజరాతీ భవన్‌లో పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వెళ్లారు. తొమ్మిది మంది తిరిగి ఆశ్రమానికి వచ్చారు. లలిత(60) రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో డిజేబుల్ హోం రిసెప్షన్ అముల్‌రాజ్ గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



లలిత

తగ్గిన పోలింగ్ శాతం



ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఆందోళన

రాంనగర్/కవాడిగూడ , మే 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థుల గెలుపుఓటములు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గంలో పోలైన ఓట్లపైనే వారి భవితవ్యం ఆధారపడి ఉంది. ముషీరాబాద్ నియోజకవర్గంలో 49.09 శాతం పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,07,995 ఉండగా 1.51.93 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 72,684, మహిళలు 78500, ఇతరులు 4 ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా అంబర్‌పేట నియోజకవర్గంలో 51.65 శాతం పోలింగ్ జరిగింది, మొత్తం నియోజకవర్గంలో - 2,79, 924 ఓటర్లు ఉండగా 1.44, 579 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 74,034, మహిళలు 70,540, ఇతరులు 2 ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ముషీరాబాద్‌లో 49.09 శాతం	అంబర్‌పేటలో 51.65 శాతం
మొత్తం ఓటర్లు 3,07, 995	మొత్తం ఓటర్లు - 2,79, 924
ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లు 1.51.93	ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లు 1.44, 579
పురుషులు - 72,684	పురుషులు - 74, 034
మహిళలు - 78500	మహిళలు - 70, 540
ఇతరులు -4	ఇతరులు -2
పోలింగ్ బూత్‌లు -274	పోలింగ్ బూత్‌లు -236

గత అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో 52 శాతం పోలింగ్ జరిగింది. పోలైన ఓట్లలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్‌కు 74 997 ఓట్లు వచ్చాయి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌కు 37,264 రాగా, బీజేపీ అభ్యర్థి పూసరాజుకు 35,265 ఓట్లు వచ్చాయి, ఈ ఎన్నికల్లో ముఠాగోపాల్ 37వేల పై చిలుకు ఓట్లతో విజయం సాధించారు. అదేవిధంగా అంబర్‌పేట నియోజకవర్గంలో 53 శాతం పోలింగ్ జరిగింది. పోలైన ఓట్లలో అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు 74,416 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్‌కు 49,879 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సి. రోహిణ్‌రెడ్డి 18004 ఓట్లు వచ్చాయి, ఈ ఎన్నికల్లో కాలేరు వెంకటేష్ 24,537 మెజార్టీ సాధించారు.

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో...

2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గంలో 1,32,160 ఓట్లు పోలవగా వీటిలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి 80,442 ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని సాయికిరణ్‌కు 34,854, కాంగ్రెస్ అభ్య ర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌కు 13 510 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంనుంచి కిషన్‌రెడ్డికి 48,440 ఓట్ల మెజార్టీ సాధించారు.

ముషీరాబాద్ నియోజకవర్గంలో 2019లో జరిగిన ఎన్నికల్లో 50 శాతం పోలింగ్ జరిగింది. దీనిలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి 46 వేల ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి సాయికిరణ్‌కు 25 వేలపైచిలుకు ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ 18 వేల ఓట్లకుపైగా పోలయ్యాయి. నియోజకవర్గం నుంచి కిషన్‌రెడ్డి 24 వేలపై చిలుకు ఓట్లమెజార్టీ లభించింది.

ముషీరాబాద్‌లో మహిళా ఓటర్లు ఎటువైపు

ముషీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఓటింగ్‌లో పురుషుల కంటే మహిళలే ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో లక్షా 57వేల 610 పురుష ఓటర్లు ఉంటే 72వేల 684 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లు ఒక లక్షా 50 వేల 373 మంది మహిళా ఓటర్లు ఉండగా వీరిలో 78 వేల 500 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 12 మంది ఓటర్లు ఉండగా కేవలం 4 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పురుషుల కంటే ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు ఏ పార్టీకి మొగ్గుచూపారు అనేది ప్రధాన పార్టీలకు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. పాల్గొన్న మహిళలలో మైనార్టీ వర్గానికి చెందిన మహిళలు ఎంతమంది. హిందు వర్గానికి చెందిన మహిళలు ఎంతమంది అనే లెక్కలకోసం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నేతలు లెక్కలు వేస్తున్నారు. మైనారిటీ మహిళలు కాంగ్రెస్ పార్టీకి మొగ్గుచూపారని ప్రచారం జరిగింది, అదేస్థాయిలో హిందూ మహిళలు కూడా బీజేపీ పార్టీకి మొగ్గుచూపారని తెలిసింది, బీఆర్‌ఎస్ పార్టీకి ఎంతమంది మహిళలు ఓట్లు వేశారు అనే అంశంపై కూడా అంతుచిక్కడం లేదు. మహిళా ఓటర్లు ఏ పార్టీకి ఎక్కువ మెజార్టీ ఓట్లు వేశారనే అంశంపై తీవ్ర చర్చ సాగుతుంది.

అంబర్‌పేట నియోజకవర్గంలో

అంబర్‌పేట నియోజకవర్గంలో దాదాపు 50 వేల పైచిలుకు ముస్లిం మైనారిటీ ఓటర్లు వీరిలో సోమవారం జరిగిన పోలింగ్‌లో యాభైశాతం మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. అయితే పోలైన మైనార్టీ ఓట్లు ఎటువైపు పడ్డాయనే అంశంపై ప్రధానపార్టీ అభ్యర్థులు పోలింగ్‌బూతుల వారిగా లెక్కలు వేసుకోవడం జరుగుతుంది. అయితే జాతీయ రాజకీయాల నేపథ్యంలో మైనార్టీల ఓట్లలో 70 శాతం కాంగ్రెస్‌కు, పడగా మిగతా 30 శాతం ఓట్లను బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు పంచుకున్నట్లు పార్టీల పరిశీలకులు అంచనాలు వేయడం జరుగుతుంది. నియోజకవర్గంలో పోలైన ఓట్లలో పురుషుల ఓట్లతో సమానంగా మహిళా ఓటర్లు ఉండటం వల్ల ఇందులో ముస్లిం మైనార్టీలు ఎంత హిందు మహిళలు ఎంతమంది అని పార్టీల నేతలు ఆరాతీస్తున్నారు.

పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలు...

సోమవారం జరిగిన ఓటింగ్ నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ముషీరాబాద్ నియోజకవర్గంలోని 274 పోలింగ్ బూత్‌లు, అంబర్‌పేట నియోజకవర్గంలోని 236 పోలింగ్ బూత్‌లలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పోలైన ఓట్లలో ఎన్నిఓట్లు వస్తాయని అంశంపై సమాచారాన్ని పోలింగ్ బూత్‌ల ఏజెంట్ల ద్వారా సమాచారం తీసుకొని గెలుపుఓటములపై లెక్కలు వేసుకుంటున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, సుధాకర్‌గుప్తా, సురేందర్, తదితరులు

ముషీరాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు భారీ మెజార్టీ

- యువజన నాయకుడు ముఠా జైసింహా

రాంనగర్ , మే 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన పద్మారావుగౌడ్‌కు ముషీరాబాద్ నియోజకవర్గంనుంచి మెజార్టీ ఓట్లు వస్తాయని ఆ పార్టీ యువజన నాయకులు ముఠాజైసింహా, సీనియర్ నాయకులు సుధాకర్ గుప్తా, సురేందర్, వల్లాల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం అడిక్‌మెట్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముఠాగోపాల్‌కు 75 వేల ఓట్లు వచ్చాయని ఈ సారి కూడా అదేస్థాయిలో పద్మారావుగౌడ్‌కు వస్తాయని భావిస్తున్నట్లు వారు తెలిపారు.

భోలక్‌పూర్ ప్రజలు బీఆర్ఎస్ వెంటే: శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో ఓటర్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేసిన అభివృద్ధిని చూసి ఓటర్లు అంతా బీఆర్‌ఎస్‌కే సంపూర్ణ మద్దతు ఇచ్చారని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం భోలక్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సెక్యూలర్ పార్టీ అయిన బీఆర్‌ఎస్‌కు హిందూ ముస్లింలు సంపూర్ణ మద్దతు ఇచ్చారని అన్నారు. సమావేశంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, మైనార్టీ కమిటీ నాయకుడు రహీం, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్ష రాసే అభ్యర్థులకు టి-సాట్ మెలకువలు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి జూన్ 3 వ తేదీ వరకు నిర్వహించే టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్)పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలు తెలియజేసేందుకు టి-సాట్ ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని టి.సాట్-సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈనెల 15 నుంచి నాలుగు రోజులపాటు ఐదు సబ్జెక్టులపై అనుభవంగల ఉపాధ్యాయులచే ప్రత్యేక లైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. టి-సాట్ నిపుణ చానల్‌లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలతోపాటు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 15న సైకాలజీ, 16న టీచింగ్ మెథడ్స్, 17న తెలుగు, 18న ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై కొనసాగే ప్రసారాలు నిపుణ చానల్‌లో, టి-సాట్ విద్యా చానల్‌లో మరుసటి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పునఃప్రసారమవుతుందన్నారు. ఇప్పటికే టెట్ అభ్య ర్థుల కోసం సుమారు 200 ఎపిసోడ్స్ టి-సాట్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ సందేహాలు- సమాధానాల కోసం 040-3540326/726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 నంబర్లకు కాల్ చేయవచ్చన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి కార్మిక కమిషనర్ కార్యాలయానికి చాలా మంది వస్తుంటారు. వారికోసం చలివేంద్రాన్ని ప్రారంభించారు.

కళపైనే శ్రద్ధ పెడితే గుర్తింపు

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): తమ కళపైనే శ్రద్ధ పెడితే కళాకారులకు గుర్తింపు సునాయాసంగా వస్తుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. రసమయి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో క్రోధి నామ ఉగాది సందర్భంగా సృజనాత్మక కళలలో ప్రతిభావంతులకు పురస్కార ప్రదాన సభ జరిగింది. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతి కళ ఆత్మానందం కోసమన్నారు. నాట్యగురువు ఎస్.పి భారతి అధ్యక్షత వహించి మాట్లాడుతూ లలితకళలు భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు అన్నారు. సంస్థ అధ్యక్షుడు డా. ఎం.కె రాము స్వాగతం పలుకుతూ గతంలో తాను బాల భవన్ డైరెక్టర్‌గా పనిచేసిన కాలంలో ఐదు వేల నగదుతో ప్రభుత్వం పక్షాన బాల ప్రతిభావంతులకు పురస్కారాలు ఇవ్వడం జరిగిందన్నారు. పన్నెండు మంది బాలలు నృత్యంలో, ఏడుగురు బాలలకు సంగీతంలో, ఏడుగురు బాలలకు చిత్రలేఖనంలో, అక్షితకు చాయాగ్రహణంలో, సంజనకు వీణలో అవార్డులు అందజేశారు.

బొట్టు బిళ్లలతో మూడు భాషల్లో జై శ్రీరామ్

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): జంటనగరాలకు చెందిన మహిళా కళాకారులు ఉమెన్ ఆర్టిస్ట్ అసోసియేషన్(డబ్ల్యూఏఏ)గా ఏర్పడ్డారు. బొట్టు బిళ్లలతో తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో జై శ్రీరామ్ బోర్డును అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డబ్ల్యూఏఏ సభ్యులు బొట్టుబిళ్లలతో రూపొందించిన జైశ్రీరామ్ బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీ నిర్వాహకురాలు కాసుల పద్మావతి, కొండాపూర్‌కు చెందిన ఆర్ట్ టీచర్ సూర్యకుమారి, బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆర్ట్ టీచర్లు యోగలక్ష్మి, ప్రతిభాదల్, తిరుమలగిరికి చెందిన డ్రాయింగ్ టీచర్ రజని మంచికంటి, సదాశివపేటకు చెందిన ఆర్ట్ టీచర్, రచయిత కోమలి బృందంగా ఏర్పడ్డారు. తమ ప్రాజెక్టుకు అయోధ్య అని పేరు పెట్టారు. గత నెల 19న 30 × 40 అంగుళాల బోర్డుపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో బొట్టు బిళ్లలు ఉపయోగించి జై శ్రీరామ్ అని అందంగా రాశారు. 12 రోజుల పాటు రోజుకు ఐదు గంటలు వెచ్చించి బోర్డు పూర్తి చేశారు. దీనికి 32,970 బొట్టుబిళ్లలు వినియోగించారు. 16,314 నారింజ, 3,192 బ్లూ, 13,464 ఆకుపచ్చ బొట్టు బిళ్లలతో జైశ్రీరామ్ బోర్డును తీర్చిదిద్దారు. ప్రతిరూప కళాకారుడు డి.నాగేశ్వరరావు నుంచి ప్రేరణ పొంది రూపొందించినట్టు తెలిపారు. అయోధ్యకు వెళ్లి రామాలయం మ్యూజియంకు దీన్ని అందజేస్తామన్నారు. తాను 220 రికార్డులు సాధించానని కాసుల పద్మావతి తెలిపారు.



మూడు భాషల్లో తయారు చేసిన శ్రీరామ్ బోర్డు

శాఖలవారీగా ఖాళీలను గుర్తించని ప్రభుత్వం

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. శాఖల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా నేటికీ గుర్తించలేదని వరంగల్, నల్లగొండ, ఖమ్మం నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు పృథ్వీరాజ్, విఠల్, తదితరులతో కలిసి 2023 డిసెంబర్ 31 నాటికి ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణలో నేటికీ అవి పూర్తి కాలేదన్నారు. శాఖల వారీగా ఖాళీలు గుర్తించలేదన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఖాళీలు భర్తీ చేసే వరకు పోరాటం చేస్తామన్నారు.

దానం నాగేందర్‌కు భారీ మెజార్టీ ఖాయం

- సీనియర్ కాంగ్రెస్ నేతల ధీమా

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్‌కు ముషీరాబాద్ నియోజకవర్గంలో మెజారిటీ ఓట్లు వస్తాయని కాంగ్రెస్ నేతలు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, ఏ అండ్ బి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వి.డి. కృష్ణ, అంజియాదవ్, ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకుడు కృష్ణగౌడ్ మాట్లాడు తూ నియోజకవర్గంలో పోలైన 49 శాతం ఓట్లలో దానం నాగేందర్‌కు మెజారిటీ శాతం ఓట్లు వస్తాయని అన్నారు.

ఆరు గ్యారంటీలే గెలిపిస్తాయి...

నల్లకుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అండగా నిలిచారని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజలకు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నల్లకుంట డివిజన్ శంకరమఠం కూరగాయల మార్కెట్ వీధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జీ.బీ. శ్యామ్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తున్నారని వారు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ డబుల్ డిజిట్ ఎంపీ సీట్లను కైవసం చేసుకుంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్యాంక్‌బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి

- అఖిల భారత సర్వసేవా సంఘ్

బర్కత్‌పుర, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్మారక భవనం, అధ్యయన కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని అఖిల భారత సర్వసేవా సంఘ్ (సర్వోదయ మండలి) జాతీయ అధ్యక్షుడు వెదిరే అరవింద్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు తొలుపునూరి కృష్ణగౌడ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సాయుధ యోధుల పోరాట పటిమను నేటితరానికి అందించడానికి పాఠ్యాంశాలలో చేర్చాలని, అన్ని యూనివర్సిటీలలో పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ట్యాంక్‌బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని గత ప్రభుత్వం దీనిపై హామీ ఇచ్చి విస్మరించిందని ఆరోపించారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి స్థలం కేటాయించాలని విన్నవిస్తామని వారు తెలిపారు.



డీఆర్‌సీ సెంటర్‌ను సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్

రెడ్డి కళాశాల డీఆర్‌సీ సెంటర్‌కు ఈవీఎంల తరలింపు

బర్కత్‌పుర/నల్లకుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 51.65 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో అయిదు మున్సిపల్ డివిజన్లలో 236 పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసిన విషయం విదితమే. నియోజకవర్గంలో 2,79,924 మంది ఓటర్లు ఉన్నారు. 1,44,579 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 70 వేల 540 మంది, పురుష ఓటర్లు 74 వేల 34 మంది, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను పటిష్టమైన భద్రత నడుమ బర్కత్‌పురలోని రెడ్డికళాశాల డీఆర్‌సీ సెంటర్‌కు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ డీఆర్‌సీ సెంటర్‌ను సందర్శించి ఈవీఎంల భద్రతను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికలు శాంతియుతంగా జరగడానికి కృషి చేసిన ఆర్వో, ఏఆర్వోలను అభినందించారు.

రద్దీలేని వేళల్లో రాయితీ ఎందుకు?

- కాంటాక్ట్ లెస్ కార్డులపై ప్రయాణికుల పెదవి విరుపు
- నాన్ పీక్ అవర్స్‌లో ఆఫర్‌ను అమలు చేయడంపై విమర్శలు
- 10 శాతం మంది కూడా వినియోగించుకోని పరిస్థితి

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లలో రాయితీలను నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. పేరు కోసం కొన్ని డిస్కౌంట్లను ప్రకటిస్తున్నప్పటికీ.. అవి అందరికీ ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. దీంతో ఎల్‌అండ్ టీ అధికారుల తీరుపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. అన్ని వేళల్లో కొనసాగించాల్సిన రాయితీలను కొన్ని గంటల వరకే పరిమితం చేయడంపై విమర్శిస్తున్నారు. మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. మూడు నెలల క్రితం రోజుకు 4.50 లక్షల మంది ప్రయాణించగా.. నెలన్నర రోజులుగా 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది గరిష్ఠంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, రైళ్లలో ఎప్పుడు చూసినా రద్దీ కనిపిస్తోంది. రద్దీకి అనుగుణంగా అధికారులు 3 నిమిషాలకోసారి రైళ్లను నడిపిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నప్పటికీ.. వీలైనన్నీ ఎక్కువ ఆఫర్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఎల్ అండ్ టీ.. ఉన్న వాటిని కూడా పూర్తిస్థాయిలో అందించకపోతుండడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉపయోగపడని కాంటాక్ట్ లెస్ కార్డ్స్

పెరుగుతున్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థ పలు రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్‌కార్డు, సూపర్ సేవర్ ఆఫర్(ఎస్ఎస్ఓ)- 59 డిస్కౌంట్, కాంటాక్ట్ లెస్ కార్డ్(సీఎస్‌సీ) కార్డులను ప్రవేశపెట్టింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు(నాన్ పీక్ అవర్స్‌లో) కాంటాక్ట్ లెస్ కార్డుల ద్వారా చేసే బుకింగ్స్‌పై 10 శాతం రాయితీ అందిస్తున్నారు. సదరు ఆఫర్‌ను కేవలం 10 శాతం మంది మాత్రమే వినియోగిస్తుండగా.. 90 శాతం మంది దూరంగా ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పీక్ అవర్స్(ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు)లో కాంటాక్ట్ లెస్ కార్డులను అమలుచేస్తే అందరికీ ప్రయోజనం ఉంటుందని, రద్దీ లేని సమయంలో రాయితీ ఇవ్వడం ద్వారా ఎవరికీ ఉపయోగం ఉండదని ప్రయాణికులు వాపోతున్నారు.

పీక్ అవర్స్‌లోనూ కొనసాగించాలి..

పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని పీక్ అవర్స్‌లోనూ ఆఫర్లను కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా 10 శాతం రాయితీతో కూడిన కాంటాక్ట్ లెస్ కార్డులను అన్నివేళల్లో అమలు చేయడం ద్వారా చాలామంది వినియోగించుకుంటారని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సూపర్ సేవర్-59, స్మార్ట్ కార్డు, కాంటాక్ట్ లెస్ కార్డుపై 10 శాతం, డిజిటల్ క్యూఆర్ టికెట్స్‌పై ఉన్న 10 శాతం రాయితీ ఎత్తివేయడంతో ప్రయాణికుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. మే 1 నుంచి ఆయా ఆఫర్లను కొనసాగిస్తామని అధికారులు ప్రకటించడం గమనార్హం.